క్లుప్తంగా

కబడ్డీ పోటీల్లో 'కృష్ణవేణి' విద్యార్థుల ప్రతిభ

మీర్‌పేట: జిల్లా స్థాయి అండర్–14, 16 కబడ్డీ పోటీల్లో మీర్‌పేటలోని గాయత్రినగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల చైర్మన్ ఎంఎం షరీఫ్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీపీయూఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థుల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. అండర్–16లో బాలికల జట్టు రెండవ బహుమతి కైవసం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రెసిడెంట్ టి.జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ సురేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

గ్రామీణ కౌశల్య యోజన ద్వారా అవగాహన సదస్సు



సదస్సులో పేర్లు నమోదు చేసుకుంటున్న నిరుద్యోగులు

మీర్‌పేట: దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు మీర్‌పేట బీజేపీ–2 అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్ తెలిపారు. ఆదివారం జిల్లెలగూడ కమల నెహ్రూనగర్‌లో సాహితీ సిస్టమ్స్ సహకారంతో గ్రామీణ కౌశల్య యోజన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాదాపు 35 మంది తమ పేర్లను నమోదు చేయించుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి సిద్దాల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గౌరిశంకర్, జిల్లెల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కురుమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న సంఘం నాయకులు

కందుకూరు: లేమూరులో కురుమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఆ గ్రామంలో సంఘం మండల అధ్యక్షుడు అచ్చన పాండు, జిల్లా నాయకుడు ఎగ్గిడి సత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. కురుమ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడిగా రావిచెట్టు రవీందర్, ప్రధానకార్యదర్శిగా కడారి మహేందర్, యూత్ అధ్యక్షుడిగా పల్లె శ్రీధర్, ప్రధానకార్యదర్శిగా చిట్టె రాజేందర్‌లను నియమించారు. కురుమలు అన్ని రంగాల్లో రాణించేలా ఒకరినొకరు సహకరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బండ ఆంజనేయులు, ఎగ్గిడి జగదీష్, మోటె రమేశ్, గజాడి మహేందర్, గజాడి మల్లేశ్, రావిచెట్టు వెంకటేశ్, ఇమిడి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.35, వంకాయ రూ.28, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.45, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.15, సొరకాయ రూ.17, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.28, మునగ రూ.40, కందగడ్డ రూ.35, బీట్‌రూట్ రూ.25, కీర రూ.18, బీన్స్ రూ.85, క్యాప్సికమ్ రూ.45. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

అగ్రసేన్ మహారాజ్ పురస్కారం అందజేత

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట అగర్వాల్, సత్యశక్తి మహిళా శాఖ ఆధ్వర్యంలో ఆర్‌కేపురం చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు అగ్రసేన్ మహారాజ్ పురస్కారం అందజేశారు. 49 సంవత్సరాల క్రితం ఒక్క రూపాయి, ఒక్క ఇటుక పిలుపుతో దేశంలో సామాజిక కార్యక్రమాలు, పేదలకు ఇళ్లు కట్టించిన గుర్తుగా అత్యున్నత పురస్కారాన్ని అగ్రసేన్ మహారాజ్ పేరుమీద ఇస్తామని శాఖా అధ్యక్షులు రాణి మిటల్ పేర్కొన్నారు. మార్గం రాజేష్ చేస్తున్న సేవలను గుర్తించి అవార్డు అందజేసినట్లు వారు పేర్కొన్నారు.

వృథాగా.. దుకాణా సముదాయం

నిరుపయోగంగా మారిన షెడ్లు

- రావిర్యాలలో రోడ్లపై చిరు వ్యాపారం
- పట్టించుకోని అధికారులు



శిలాఫలకం



రావిర్యాలలో నిర్మించిన షెడ్లు

తుక్కుగూడ: చిరు వ్యాపారులకు, ప్రజలకు మౌలిక వసతులు కల్పించే ఉద్దేశ్యంతో మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో నిర్మించిన దుకాణాల షెడ్లు వృథాగా మారాయి. రూ. లక్షలు వెచ్చించి నిర్మించి ఇంత వరకు కేటాయించ లేదు. దీంతో వార్డు కార్యాలయం వద్ద రోడ్డుపై కూర్చొని ఆకుకూరలు, కూరగాయాలు, పండ్లు తదితర సరుకులను విక్రయిస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం నిర్మించిన మార్కెట్ సముదాయం వార్డు కార్యాలయం వెనుక భాగంలో ఉండడంతో కొనుగోలుదారులు రారానే కారణంతో అక్కడికి పోవడానికి ఆసక్తి చూపడం లేదు.

రూ.30 లక్షలతో..

రావిర్యాల చౌరస్తాలోని వార్డు కార్యాలయ ఆవరణలోని వెనక భాగంలో మున్సిపాలిటీ సాధారణ, పట్టణ ప్రగతిలో భాగంగా రూ.30 లక్షల నిధులను వెచ్చించి దుకాణ సముదాయాన్ని నిర్మించారు. వీటి పనులు పూర్తి చేసిన అనంతరం అప్పటి విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి 2023, ఆగస్టు 26న వాటిని ప్రారంభించారు. దాదాపు రెండు సంవత్సరాలు పూర్తయినప్పటికీ వాటిని కేటాయించకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.

రోడ్లపైనే అమ్మకాలు

కూరగాయాలు, ఆకు కూరలు సాగు చేసే రైతులు, ఇతర చిరు వ్యాపారులు వార్డు కార్యాలయం వద్ద రోడ్డుపైనే క్రయ, విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడే ప్రభుత్వ పాఠశాల, వార్డు కార్యాలయం ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. ఆదివారం రావిర్యాల, కొంగరకలాన్, మంగల్‌పల్లి, ఆదిబట్ల, సర్దార్‌నగర్ తదితర గ్రామాల్లోని ఇటుక బట్టీల వద్ద పనిచేసే కార్మికులు వందల సంఖ్యలో వస్తుంటారు. కాబట్టి ఇక్కడ క్రయవిక్రయాలు జోరుగా సాగుతాయని చిరు వ్యాపారులు చెబుతున్నారు. కొందరు దుకాణ సముదాయాలకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. అవి చిన్నవిగా ఉన్నాయని, కొనుగోలు దారులు రారాని అపోహతో ఉన్నారు. ఈ విషయంలో వారికి అవగాహన కల్పించి కేటాయించే అధికారులు కరువయ్యారు. దీంతో రూ. లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన దుకాణాలు వృథాగా మారుతున్నాయి. ఇవి ప్రస్తుతం అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా నిలుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి షెడ్లను వ్యాపారులకు కేటాయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రెండు షెడ్లను ఒకటిగా చేసి..

రావిర్యాలలో మున్సిపాలిటీ అధికారులు నిర్మించిన షెడ్లు చిన్నగా ఉండటంతో వ్యాపారులు అక్కడికి పోవడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం నిర్మించిన వాటిలో రెండు షెడ్లను కలిపి ఒకటిగా చేసి కేటాయించాలి.

– శివశంకర్, కూరగాయాల వ్యాపారి, రావిర్యాల

దుర్వాసన వెదజల్లుతోంది

షెడ్లు వృథాగా ఉండటంతో చాలా మంది అక్కడ మద్యం సేవించడం, మలమూత్ర విసర్జన తదితర పనులు చేస్తున్నారు. దీంతో అక్కడ దుర్వాసన వెదజల్లుతోంది. మేము చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– చంద్రశేఖర్‌రెడ్డి రావిర్యాల

ప్రజలకు నిజమైన సమాచారం చేరవేయాలి



మాట్లాడుతున్న రాంచందర్‌రావు

హస్తినాపురం: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మీడియా, ఐటీ, సోషల్ మీడియా కార్యక్రమాలను నిర్వహించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారావు అన్నారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని పిండి పుల్లారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన మీడియా, సోషల్ మీడియా వర్క్ షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మీడియా, సోషల్ మీడియా వేదికలు ప్రజలకు నిజమైన సమాచారం చేరవేయడంలో కీలకంగా మారాయన్నారు. పార్టీ సిద్ధాంతాలు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజా సమస్యల పరిష్కార చర్యలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త సోషల్ మీడియాను సక్రమంగా వినియోగించుకుని తప్పుడు ప్రచారాలను వెంటనే ఖండించే విధంగా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మన్, రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్‌జీ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపి పార్టీ అధ్యక్షుడు వన్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



ఎస్‌ఐ నవీన్‌ను సన్మానిస్తున్న ఏసీపీ

మలక్‌పేట: విధి నిర్వహణతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని మలక్‌పేట ఏసీపీ సుబ్బారామిరెడ్డి అన్నారు. తీగలగూడలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మలక్‌పేట పోలీస్‌స్టేషన్ విధులు నిర్వహించి పదవీ విమరణ పొందిన వారికి, ఇటీవల బదిలీపై వెళ్లిన ఎస్సైలు నవీన్, సురేష్, కానిస్టేబుళ్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజల ఆదరాభిమానాలు చూరగొనేలా పని చేయాలని, ఉన్నతంగా ఎదిగి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జయశంకర్, ఎస్సైలు సంజీవ్‌రెడ్డి, తేజ్యానాయక్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: చిన్నపాటి వర్షానికే పైకాలనీల నుంచి వచ్చే వరదతో ఆగమయ్యనగర్ నీటమునిగేదని ఎస్‌ఎన్‌డీపీ ట్రంక్‌లైన్ల పనులతో వరద ముంపు తగ్గిందని, కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ ఆగమయ్యనగర్‌నగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే ఆదివారం కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. గతంలో వేసిన డ్రైనేజీ పైపుల ఆధునీకరణకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పెద్దచెరువు శ్మశానవాటిక వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగిస్తామన్నారు. రెండు రోజుల క్రితమే జోనల్ కమిషనర్‌తో పర్యటించానని ఆయన సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విఠల్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీష్‌యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, రుద్రయాదగిరి, కరుణాకర్, అంజయ్య, యాదగిరి పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ

ఇబ్రహీంపట్నం: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలను జరుపుకోవాలని ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. ఆదివారం దండుమైలారం గ్రామంలో గణేశ్ మండపాల నిర్వాహకులతో ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సున్నిత గ్రామమైన దండుమైలారంలో నవరాత్రోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, ఏమైనా సమస్యలు ఎదురైనా పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నీటిలోనే కాలనీలు



కాలనీవాసులతో మాట్లాడుతున్న అరవింద్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఇటీవల కురిసిన వర్షాలకు వివిధ కాలనీలు జలమయమయ్యాయి. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్, వినూత్ననగర్ కాలనీల్లో ఇంకా నీరు నిలిచే ఉంది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డికి ఆదివారం కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. పైకాలనీల నుంచి వచ్చే వరద నీరు, మురుగునీరు గాంధీనగర్ సౌత్‌కాలనీ, వినూత్న ఎన్‌క్లేవ్ కాలనీలకు చేరడంతో ఇబ్బందుదు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

వ్యక్తి అదృశ్యం

చంచల్‌గూడ: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బిహార్ రాష్ట్రానికి చెందిన అజయ్‌రాయ్ (40) బతుకుదెరువు కోసం ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చాడు. ఇంట్లో గొడవ కారణంగా గత సోమవారం ఇంటి నుంచి వెళ్లి ఎంతకీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్

వ్యక్తిపై కేసు నమోదు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సిలిండర్లు

చైతన్యపురి: అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నింపి విక్రయిస్తున్న ఇంటిపై పోలీసులు దాడిచేసిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. ద్వారకాపురి కాలనీలో చిన్న సిలెండర్లలో గ్యాస్ నింపి అవసరమైన వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని 12 గృహ వినియోగ సిలిండర్లు, రెండు చిన్న సిలిండర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

గురుకుల పాఠశాల పరిశీలన

ఇబ్రహీంపట్నం: చర్లపటేల్‌గూడ సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను ఆదివారం బాలల న్యాయ సేవల విభాగం జిల్లా సభ్యుడు సీహెచ్ రవి సందర్శించారు. శుక్రవారం పాఠశాల భవనంపై నుంచి ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై ఆయన తోటి విద్యార్థులతో ఆయన మాట్లాడి.. ఘటన గురించి ఆరా తీశారు. తల్లిదండ్రులపై బెంగతోనే బాలిక అఘాయిత్యానికి పాల్పడిందని తెలిపారు. అనంతరం వంట గదిని తనిఖీ చేశారు. సామగ్రిని పరిశీలించారు.

సురవరం సేవలు చిరస్మరణీయం



హుడాకాంప్లెక్స్: సురవరం సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మీర్‌పేట: నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ మల్లేశ్, మీర్‌పేటకు చెందిన నాయకులు

హుడాకాంప్లెక్స్: సురవరం సుధాకర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం సరూర్‌నగర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట సీపీఐ మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నర్సింహ ఆధ్వర్యంలో సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యుడు జిల్లెల కృష్ణ, కమలమ్మ, మహబూబ్, రమావత్ సక్రునాయక్, నూర్జహాన్ ఇస్తారి, ఎండి.సాహెద్, వసంత, నర్సమ్మ పాల్గొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: సుధాకర్‌రెడ్డి మృత దేహాన్ని వైద్య వృత్తి అభ్యసించేందుకు వీలుగా గాంధీ మెడికల్ కళాశాలకు అందజేయడం గొప్ప కార్యమని మీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్ తెలిపారు. ఆదివారం మక్దుంభవన్‌లో నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి మీర్‌పేట మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, ఇతర నాయకులతో కలిసి ఆయన నివాళులర్పించారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మల్లారెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలో 24వ డివిజన్‌లోని అల్మాస్‌గూడ వైఎస్‌ఆర్ నగర్ ఫేస్–2 నుంచి గుర్రంగూడ వెళ్లే మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేస్తున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నేత, డివిజన్ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి బీఆర్‌ఎస్ పాలకులు, వైఎస్‌ఆర్ కాలనీ–2లో కనీస సదుపాయాలు కల్పించలేకపోయారన్నారు. వర్షాలు పడిన సమయాల్లో ఇళ్లల్లోకి వరదనీరు చేరుతుందనే విషయాన్ని వారికి పలు మార్లు విన్నవించినా పెడచెవినా పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పట్టించుకోని స్థానిక కార్పొరేటర్‌పై ఆయన ఘాటుగానే విమర్శించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్‌తో మాట్లాడి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి నిధులు మంజూరు చేయించారన్నారు. వెంటనే కార్పొరేషన్ కమిషనర్ సరస్వతీ నిధులు కేటాయించి పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. ఏళ్ల నుంచి ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నవారు మల్లారెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

రవీందర్ మృతి పార్టీకి తీరని లోటు

మహేశ్వరం: ఘట్టుపల్లి గ్రామంలో మృతి చెందిన మాజీ వార్డు సభ్యుడు బొల్లేపాక రవీందర్ భౌతికకాయానికి మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితారెడ్డి ఆదివారం నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రవీందర్ మృతి పార్టీకి తీరనిలోటన్నారు. మృతుడి కుటుంబాన్ని పార్టీ తరపునా అండగా ఉంటామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొరుపోలు అనితారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొరుపోలు ప్రభాకర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్ర శంకరయ్య, మాజీ ఉప సర్పంచ్ మేకల శ్రీనివాస్ యాదవ్, నాయకులు ఎండి.సాదత్, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, పర్శా నాయక్, స్వామి, మంజుల పలువురు పాల్గొన్నారు.

అధికార పార్టీ అండతోనే కూల్చివేతలు



గుడి ప్రహరీని పరిశీలిస్తున్న కుర్మ సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: అధికార పార్టీ అండతోనే ఆలయ ప్రహరీని హైడ్రా కూల్చివేసిందని కుర్మసంఘం నాయకులు ఆరోపించారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలో బీరప్ప దేవాలయం వెనకాల నిర్మించిన ప్రహరీని కూల్చివేసిన ప్రదేశాన్ని వారు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చక్రదర్ వెంచర్‌కు ఆలయానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. వెంచర్ యాజమాన్యం తప్పుడు రోడ్డును చూపించి, ప్లాట్లుగా విక్రయించారని ఆరోపించారు. నక్ష రోడ్డు ఎక్కడా లేదన్నారు. హైడ్రా అధికారులు కనీస అవగాహన లేకుండా ఎలా కూల్చి వేస్తారని ప్రశ్నించారు. ఆ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దకుర్మ జమ్మ శ్రీశైలం, బాలం యాదగిరి, జంగయ్య, రాజు, బీరప్ప, శివ, శ్రీనివాస్, వెంకటేశ్, భాస్కర్, సతీష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్పర్ బోర్డు నిధులు ఇతర సంస్థలకు మళ్లించొద్దు



సమావేశమైన భవన నిర్మాణ కార్మికులు

చైతన్యపురి: భవన నిర్మాణ కార్మికుల హెల్పర్ బోర్డులో ఉన్న నిధులను ఇతర సంస్థలకు మళ్లించవద్దని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పార్వతి, భవన నిర్మాణ కార్మిక యూనియన్ రంగారెడ్డి జిల్ల అధ్యక్షుడు చైతన్య అన్నారు. సరూర్‌నగర్ భవన నిర్మాణ కార్మిక యూనియన్ నాలుగవ మహాసభ చైతన్యపురిలోని కామ్రేడ్ బోడేపూడి వేంకటేశ్వర స్మారక కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు ఉన్నవారికి రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సరూర్ నగర్ ప్రాంతంలో అడ్డా కార్మికులకు అందుబాటులో ఉండేలా ఏఎల్‌ఓ కార్యాలయం సరూర్‌నగర్ సర్కిల్ ఉండాలన్నారు. ఈ సందర్భంగా 25 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో రామ్మోహన్, చైతన్య, శంకర్, లతీఫ్, పరశురాములు, యాదగిరి, శంకర్, పి.శ్రీను పాల్గొన్నారు.

మాలల అభివృద్ధే లక్ష్యం

మలక్‌పేట: మాలల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని మలక్‌పేట మాల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి బల్వంత్ అన్నారు. మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్ బాలదానమ్మ బస్తీ కమ్యూనిటీహాల్లో ఆదివారం నిర్వహించిన సంఘం మూడో వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామన్నారు. మాలల ఐక్యత చాటుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు.అంతకు ముందు మృతి చెందిన సంఘ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. బాలదానమ్మ బస్తీ నుంచి ర్యాలీగా తరలి వెళ్లి మూసారంబాగ్ చౌరస్తాలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, ధన్వంత్, నర్సింగ్‌రావు, రాంచందర్, శ్రీకాంత్, వినోద్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు